క్లుప్తంగా

నేడు బొడ్రాయి ప్రతిష్ఠాపన సమావేశం

మక్తల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో హిందూ దార్మిక సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, చేతివృత్తుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

పాపన్న జయంతిని జయప్రదం చేద్దాం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన గౌడకులస్తుల సమావేశంలో గౌడ సంఘం జిల్లా కన్వీనర్ కె. భీమయ్యగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఈ విద్యా సంవత్సరంలో పది, ఇంటర్, ఎంసెట్, నీట్, ఉన్నత పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులతోపాటు గౌడకులస్తుల ప్రజాప్రతినిధులకు సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మనోహర్, ప్రసాద్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, జెడ్పీటీసీ సభ్యులు అశోక్‌గౌడ్, సర్పంచ్ గురునాథ్‌గౌడ్, భీంచందర్‌గౌడ్, రవిగౌడ్, కృష్ణయ్యగౌడ్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాలనీలకు కలుషిత నీరు సరఫరా

కోస్గి: పట్టణంలోని టీచర్స్‌కాలనీ, విద్యానగర్ కాలనీలకు గత కొన్నిరోజులుగా కలుషితమైన మిషన్‌భగీరథ నీరు సరఫరా అవుతుందని, ఈ విషయమై పలుమార్లు సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. 45రోజుల నుంచి నీరుసైతం సక్రమంగా సరఫరా చేయడం లేదని, కలుషితం లేని తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో నిండుకున్న మురుగు కాల్వలను సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా వార్డుల ప్రజలు పేర్కొన్నారు. వర్షాకాలంలో కాల్వల్లో మురుగునీరు నిండుకోవడం, ,చెత్తాచెదారం నిల్వ ఉండటంతో ధుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగిందని తెలిపారు. మురుగు కాల్వలను పరిశుభ్రం చేయాలని సంబంధిత మున్సిపల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు.



వికసించిన బ్రహ్మకమలం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని గోపాల్‌పేట వీధికి చెందిన కూరగాయల వ్యాపారి శశికాంత్‌యాదవ్ ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. గతమూడు రోజులుగా రాత్రి సమయంలో పూసిన పువ్వుకు మహిళలు హారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం కమలాన్ని పట్టణ శివారులోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రహ్మకమలం వికసించడం అదృష్టంగా బావిస్తున్నట్లు చెప్పారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..

- అధ్వానంగా మారిన వర్క్యూర్- నేరడగం రోడ్లు
- గుంతల రోడ్లపై ప్రజల నరకయాతన
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన వర్క్యూర్ బీటీ రోడ్డు (ఫైల్)

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా గతేడాది ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. అందులో పలు గ్రామాల బీటీరోడ్ల మరమ్మతుల కోసం రూ. 2కోట్ల 65 లక్షలు కేటాయించారు. వీటిని మాగనూర్ నుంచి వర్క్యూర్ గ్రామం మీదుగా నేరడగం గ్రామం వరకు బీటీరోడ్డు మరమ్మతులకోసం రూ. 2 కోట్ల 10 లక్షలు, మరోకటి నేరడగం నుంచి నేరడగందొడ్డి వరకు రూ. 55 లక్షలు రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు గాను వినియోగించనున్నారు. నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా, ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంత ఆయా గ్రామప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లపై వెళ్లేందుకు, వాహనదారులు, ప్రజలు నరకయార పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు త్వరగా చేపట్టాలని కోరుతున్నారు.

మట్టిరోడ్డుగా మారి ఇబ్బందులు..

గతంలో మాగనూర్ నుంచి వర్క్యూర్ మీదుగా నేరడగం వరకు ఉన్న బీటీరోడ్డు మట్టిరోడ్డుగా మారింది. మాగనూర్, వర్క్యూర్ గ్రామాల్లోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుక రిచ్‌ల నుంచి భారీలోడ్‌లతో టిప్పర్లు రోడ్డుపై తిరగడంతో గుంతఏర్పడి వాహనదారులు ప్రజలు నరకయాతన పడుతున్నారు.



నేరడగం సమీపంలో రోడ్డు ఇలా (ఫైల్)



బురదమయంగా మారిన నేరడగందొడ్డి రోడ్డు (ఫైల్)

పంటలు పండటం లేదు..



ప్రస్తుతం ఉన్న రోడ్డుపై ఇసుక టిప్పర్లు తిరుగుతుండటంతో నిత్యం దుమ్ము, దూళీతో పంటలు పండటం లేదు. గతంలో వరిసాగు చేసి దిగుబడి రాక అప్పులు మిగిలాయి. రోడ్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించిన ఫలితం మాత్రం శూన్యం.

– నరహరి, రైతు, మాగనూర్

నిత్యం నరకం..



రోడ్డు మొత్తం పాడై ఏళ్ల గడుస్తోంది. అడుగడుగునా గుంతలే ఉన్నాయి. దీంతో రోడ్డు గుండా బైక్‌ల మీద రావాలన్నా, నడిచి రావాలన్న.. ఇబ్బందవుతుంది. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయించాలి.

– మల్లేష్, నేరడగం గ్రామస్తుడు

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..



ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం పనులు జరుగుతుండటంతో మరమ్మతుల పనులకోసం ఏ కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. అయితే ఉన్నతాధికారులకు సమస్య తెలియజేసి అతిత్వరలో పనులు ప్రారంభించి సమస్య పరిష్కరిస్తాం.

– వీలోక్, ఏఈ పంచాయతీరాజ్, మాగనూర్

ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ

నారాయణపేట టౌన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలమేరకు ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో కౌన్సిలర్ ఎండీ సలీం ఇంటింటికీ తిరిగి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల ముగింపులో భాగంగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా 15వ వార్డులో కౌన్సిలర్ బండి రాజేశ్వరి ఇంటింటికీ తిరుగూ జాతీయ జెండాలను పంపిణీ చేశాఇరు. ప్రతి ఒక్కరూ ఆగస్టు 15న ఇంటింటిపై జెండాలను ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి శివరాం రెడ్డి, హన్మంతు, రామకృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : స్వాతంత్ర్యం సాధించి 75ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ముగుస్తున్న నేపద్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగరవేయాలని వక్తలు కోరారు. ఆదివారం పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో మువ్వన్నెల జెండాల పంపిణీని చేపట్టారు. ప్రతిఒక్కరూ ఇంటిపై జెండాను ఎగరవేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సింగారంలో జెండాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న నాయకులు

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండలో 96వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. ఆదివారం గనిమోనిబండ ప్రజల దీక్షలో సాధనసమితి సభ్యులు మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యంకోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. ఇటీవల వరుసగా ఎన్నో అనవరమైన గ్రామాలను మండలాలుగా చేసిన కేసీఆర్ కేవలం రాజకీయ లబబ్ధికోసమే కోటకొండపై వివక్ష చూయిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, నారాయణ, వెంకటయ్య, బాలకృష్ణ, యాదగిరి, చెన్నారెడ్డి, చెన్నప్పయాదవ్, బలరాం, వెంకట్రాములు, వెంకటేష్, కనకప్ప, రాములు, కాశీనాథ్ పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం..

- గేదె మృతిచెందినా ఇన్సూరెన్స్ కట్టాలంటున్న అధికారులు

మరికల్: మహిళా సంఘాల సభ్యులకు కేటాయించిన పాడి పశువుల పథకంలో భాగంగా ఓ సభ్యురాలికి అందజేసిన పాడి గేదె ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతిచెందగా.. ఇన్సూరెన్స్ డబ్బులు కిస్తుల వారీగా కట్టాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని బాధిత మహిళా రైతు మమత వాపోయింది. ఈ మేరకు ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడింది. మూడేళ్ల క్రితం మహిళా సంఘం రుణంతో పాడి గేదెను తీసుకోగా ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అంతవరకు ఇన్సూరెన్స్ కోసం నెలకు రూ.2,500 బ్యాంకులో చెల్లించామన్నారు. గేదె మృతిచెందిన తర్వాత రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు అడిగితే మీరే ఇంకా ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని తిరకాస్తు పెట్టారని వాపోయింది. మృతిచెందిన గేదెకు రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు రూ.75 వేలు ఇవ్వాలని ఏడాది నుంచి అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతుంది.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

మక్తల్: మండలంలోని జక్లేర్ చెరువుకట్టపై గుంతలమయమైన బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని విద్యావంతుల వేదిక ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మహేష్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నిత్యం జక్లేర్ చెరువుకట్టపై బిజ్వార్, పులిమామిడి, ఊట్కూరు తదితర గ్రామాల నుంచి గద్వాల, ఆత్మకూర్ తదితర పట్టణాలకు ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. చెరువు కట్టపై గుంతలు ఏర్పడడంతో ద్విచక్రవాహనదారులు, ట్రాక్టర్లు, జీపులు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్: పట్టణానికి చెందిన చరణ్, వైభవ్, ప్రణవిలను ఆదివారం హైదరాబాద్‌క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. పెన్ను, పేపర్ లేకుండా మెదడులో కసరత్తు చేసి గణితంలో సమాధానాలు చెప్పేవిధానం అబాకస్‌లో అతివేగంగా అత్యధిక ప్రశ్నలను సాధించి ప్రపంచ రికార్డు పొందడంపై ఆయన ఆశ్చర్య వ్యక్తం చేశారు. అబాకస్‌లో ఆర్థమెటిక్ క్యాలిక్యులేషన్ ప్రక్రియలో ప్రపంచరికార్డు సాధించడం దేశానికే గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్నిరికార్డులు నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావునామాజి, శిక్షకురాలు రీతు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కేంద్ర మంత్రి

పేద కుటుంబానికి అండగా ఉంటాం

కృష్ణ: మండలంలోని గుడేబాల్లూర్ గ్రామానికి చెందిన నక్క నర్సప్ప గతకొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం బీఆర్ఎస్ మాజీ వైస్ఎంపీపీ గజ్జి ఆంజనేయులు తన జన్మదినం సందర్భంగా మానవత్వం చాటుకున్నాడు. నక్క నర్సప్ప కుటుంబానికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రతి నెల రూ. 1000, ప్రతి రెండు నెలకొసారి 50 కేజీల బియ్యంతో అందించడంతోపాటు అన్నివిధాల బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. దీంతో గ్రామస్తులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ అంబ్రేస్, బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న ఆంజనేయులు

కుమ్మరి సంఘం కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

కోస్గి: కుమ్మరి సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన మండలస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా కుమ్మరి పెద్ద వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా దస్తయ్య, ప్రధాన కార్యదర్శులుగా బసప్ప, వెంకటప్ప, కో–శాధికారులుగా కృష్ణయ్య, గోపాల్, సలహాదారులుగా దస్తయ్య, రాజుతోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇదే క్రమంలో యూత్ కమిటీ అధ్యక్షుడిగా అంజిలయ్య, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, చంద్రయ్య, ప్రధాన కార్యదర్శులుగా ప్రభు, కేశవులు, కో–శాధికారిగా రాము, సలహాదారులుగా సూరి, బుగ్గప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కుమ్మరులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఊట్కూరు: మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని సర్దార్‌నగర్ వీధికి చెందిన బొంబాయి శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు రూ. 21వేల ఆర్థిక సాయం అందజేశారు. మూడు రోజులక్రితం మేస్త్రీ బొంబాయి కృష్ణయ్య కుమారుడు శ్రీకాంత్ ఇంట్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో గాయాపాలైయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మేస్త్రీ సంఘం నాయకులు రూ. 21 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో భవననిర్మాణ సంఘం అధ్యక్షుడు కూతల నాగేష్, నాయకులు అంజప్ప, కుమ్మరి లక్ష్మయ్య, రఘు, బాలకృష్ణ, వెంకటప్ప పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్సీని కలిసిన తపస్ నాయకులు



ఎమ్మెల్సీని కలుసుకున్న తపస్ నాయకులు

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని ఆదివారం తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కొత్తబ్లాక్‌లో క్యాంప్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు మెడికల్‌బిల్స్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇబ్బందులు వివరించారు. కేజీబీవీ, మాడల్‌స్కూల్, ఆదర్శ పాఠశాలల సమస్యలు తెలియజేశారు. పాఠశాలల్లో స్కావింజర్ల ఏర్పాటుపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

పేటలో బీజేపీ మోటర్‌సైకిల్ ర్యాలీ

నారాయణపేట రూరల్ : ఆజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదుట ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు రతంగపాండు రెడ్డి జెండా ఊపి మోటర్‌బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో నాటి త్యాగవీరుల చరిత్రను స్మరించుకుని భవిష్యత్ తరాలకు తెలియచెప్పాలన్నారు. బీజేపీ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మోది పాలనలో దేశం సుభిక్షంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో రఘువీర్, రాము, గోపాల్, రఘురామయ్యగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

ముళ్లచెట్ల పొదలో కేఎస్‌పీ కాల్వ



కాల్వలో కమ్ముకున్న కంపచెట్లు

మరికల్: తీలేర్ పంపుహౌస్ నుంచి వచ్చిన డిస్ట్రిబ్యూటర్ 16 కాల్వ ముళ్లపొదలతో కమ్ముకున్నది. పంపుహౌస్ నుంచి కన్మనూర్ వరకు 20 కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ కాల్వలో ముళ్లచెట్లతోపాటు పిచ్చిమొక్కలు పెరగడంతో నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నీళ్లు వదలడంతో ముళ్లచెట్లు అడ్డుకావడంతో అలస్యంగా ముందుకెళ్తున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ తవ్వి ఏళ్ల గడుస్తున్నా నేటికి చెట్లను తొలగించలేదని రైతులు తెలిపారు. ప్రాజెక్టు అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యసేవలు

- రూ. 1. 20 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం
- మండలానికి ప్రభుత్వ ఆస్పత్రి మంజూరు



కృష్ణ: కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలు ఏన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ వైద్యసేవలకు ఎదురు చూసిన కల సాకారమైన వేళ.. మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేయడంతోపాటు ఇక తమకు వైద్యకష్టాలు దూరమయ్యాయని అంటున్నారు. కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు ఏ చిన్నకష్టం వచ్చినా వైద్యసేవలకు కర్ణాటకలోని రాయచూర్‌లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నది. పైగా ఈ ప్రాంతం నుంచి రవాణ సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే కావడంతో చాలా మంది సరైన వైద్యం లభించక ప్రాణాలు పొగొట్టుకున్న సందర్భాలు కోకొల్లలు ఉన్నాయి. ఈ విషయంపై గతకొంత కాలంగా తమకు మండల కేంద్రంలో ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ఈ మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తుండడంతో ఎమ్మెల్యే స్పందించి మండలానికి నూతన ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేయించారు.

వైద్య కష్టాలు తీరనున్నాయి..



ఇక మీదట సామాన్య ప్రజల వైద్యకష్టాలు తీరనున్నందుకు సంతోషంగా ఉంది. మండలంలోని 13 పంచాయతీల ప్రజలకు ఏ చిన్న ప్రమాదం జరిగిన, లేదా విష పురుగులు కాటేసినా, మహిళల ప్రసవ సమయంలో ఇబ్బందులు కలిగినా కర్ణాటకలోని రాయచూర్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తున్నది. ఇక మీదట అలాంటి కష్టాలు ఉండవు.

– అంజనమ్మపాటీల్, జెడ్పీటీసీ సభ్యురాలు

చాలా ఆనందంగా ఉంది..



మా మండలానికి ఎమ్మెల్యే 30పడకల ఆస్పత్రిని మంజూరు చేయించడం ఆనందంగా ఉంది. చాలా కాలంగా వైద్యసేవలు అందక ఇబ్బందులకు గురవుతున్నాం. మాకు మాగనూర్, లేదా మక్తల్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక అలాంటి ఇబ్బందులు ఉండవు.

– మోహేష్, కుసుమర్తి గ్రామం

రూ. 1.20 కోట్లతో..



మండలానికి కోటి 20లక్షలతో 30పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నాం. మండల ప్రజలకు అత్యవసర వైద్యసేవలతోపాటు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఈ మండలానికి ముఖ్యంగా బాలికల కొరకు ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా పాఠశాలతో పాటూ కళాశాలను కూడా ఏర్పాటుచేసి, అందుకు నూతన భవనాన్ని నిర్మించాం. అదే విధంగా ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలకు వైద్యసేవల నిమిత్తం అదునాతన పద్ధతిలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నాం.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే

'ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారు'

స్టేషన్ మహబూబ్‌నగర్: అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో అరాచక పాలన సాగుతోందని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ప్రజాస్వామికబద్ధంగా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారని, ఓర్వలేని కొందరు నాయకులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా రాజకీయాల్లో బీఆర్ఎస్ నాయకులు కొత్త ఒరవడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రిపై కేసు నమోదైతే దానిపై ప్రతిపక్ష నాయకుడు మాట్లాడితే దానిపై సంస్కారహీనంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కోడూర్ శివారులోని తన వ్యవసాయ భూమిలో ఫెన్సింగ్‌లను తొలగించారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

దేవరకద్ర: చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. రెండు మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో పాటు జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com